# ప్రయోజకుడు

"శ్రీహరి ఎలాంటి వాడైంది తెలిసీ తెలిసీ యితనితో కలసి బయల్దేరడానికీ అంగీకరించడం నా బుద్ధి హీనత" అనుకున్నాడు. సత్యం.

సత్యం అలా అనుకున్న సమయానికి, శ్రీహరి సైకిలుపైన ఒకటి, ఒకటిన్నర ఫర్లాంగు ముందుగా వెళ్తున్నాడు. సత్యం మాత్రం సీటుమీద నిటారుగా కూర్చోలేక హాండిల్‌బారు వైపుకి వంగిపోయి, చెమటతో దొప్పదోగి పోతున్న ముఖాన్ని మాటిమాటికీ చేతిగుడ్డతో తుడుచుకుంటూ. ఉచ్ఛ్వాస నిశ్వాసాల ఉరవడిలో కొలిమితిత్తిలా రొప్పుతున్నాడు.

అప్పటికి ఇంటిదగ్గర బయల్దేరుతున్నప్పుడు సత్యం చెప్పనే చెప్పాడు. "ఒరే శ్రీహరి! మన మిప్పుడు ఇరవై మైళ్ల దూరంలో వున్న ఆ వూరికి తమాషాగా మాత్రమే బయల్దేరుతున్నాము. నువ్విది గూడ ఒక సైకిలు పందె మనుకునేవు! నే నెప్పుడూ సైకిల్లో ఐదారు మైళ్లకంటె ఎక్కువ దూరం ప్రయాణం చేయలేదు. నువ్వు నీ పరాక్రమాన్నంతా సైకిలు పైన చూపించి, నా అభిమానాన్ని రెచ్చగొట్టి రోడ్డులో నన్ను నానా తిప్పలు పెట్టేటట్టయితే ఇక జన్మలో నీతో కలిసి ప్రయాణం చేయను." అని. కానీ ఆ హెచ్చరిక బూడిదలో పోసిన పన్నీరైంది. సైకిలు పైన అధిరోహించగానే ఒళ్లు మరిచిపోవడమనేది శ్రీహరికి పుట్టకతో వచ్చిన బుద్ధి.

ఎండ నిప్పులు చెరిగి పోస్తున్నది. సూర్య భగవానుడు సంవత్సరం పొడుగునా ఎండను పెట్టెలో వేసి తాళం వేసుకుని ఆ రోజు మూత తీసినట్టు తోచింది సత్యానికి. అసలీ మండుటెండలన్న వాటితో సత్యానికి అంతవరకూ వున్న పరిచయం చాలా తక్కువ. పట్టణంలో ఎండలు బొత్తిగా లేవనికాదుగానీ, వాటినుండి సత్యానికి రక్షణ నివ్వడానికి అక్కడ ఇంట్లోనైతే ఎలక్ట్రిక్ పంకాలున్నాయి. ఆఫీసులోనైతే, కట్టడానికి చుట్టూ పెద్ద పెద్ద వేపచెట్లున్నాయి. నాలుగు బారల దూరం నడనగలిగినట్లయితే ఏ హూటల్‌లో నయినా కూల్ డ్రింక్స్ దొరుకుతాయి. ఎలక్ట్రిక్ పంకాలు, వేపచెట్లు, శీతల పానీయాలు– వీటినుంచీ

దూరదూరంగా వెళ్లిపోతున్న కొద్దీ సత్యానికి గ్రీష్మ తాపానికి సంబంధించిన పరమ సత్యాలు కొన్ని - కొట్టి, తిట్టి, చెవులు నులిమి, తొడపాశం పెట్టి గురువుగారు నేర్పించిన పాఠాలకుమల్లే బోధపడసాగాయి. ఈ ఎండ బండలపైన ఎండమావుల్ని సృష్టించ గలదు. ఈ ఎండ కత్తి వాదరకు మల్లే తళ తళలాడిపోతూ, శరీరాన్ని దూసుకుపోయి లోలోపలి అంగాల్ని సైతం కుతకుత లాడించగలదు. రోళ్లు పగిలే ఈ రోహిణికార్తె ఎండ చేయలేని దేముంది? ఇది మానవుణ్ణి ఎన్నెన్ని విధాలుగా నైనా భాధింప గలదు.

"ఒరే శ్రీహరీ! కాస్త ఆగరా బాబూ! నీకు పుణ్యముంటుంది" ఎలుగెత్తి వాపోయాడు సత్యం. కానీ ముందుగా వెళ్తున్న సైకిల్ ఆగలేదు. అందుకోవలసిన ఆదర్శానికి అభిముఖంగా అచంచలమైన పట్టుదలతో సాగిపోతున్న తాపసోత్తముని జీవిత లక్ష్యంలా అది ఎండను చీల్చుకొని ముందుకు వెళ్లిపోతూనే వుంది.

జీవితంలో మొట్టమొదటి సారిగా అరణ్య రోదనమంటే ఏమిటో సత్యానికి అవగతమైంది.

ఎండ సంగతలా వుండగా, యిప్పుడతను వెళ్తున్నది ఒక రోడ్డుపైనేనా అన్న సందేహం సత్యానికి చాలాసార్లు కలిగింది. ఈ రోడ్డు పాములా మెలికలు తిరుగుతుంది. సరాసరి పర్లాంగుకు రెండు మిట్టలూ, రెండు పల్లాలూ వున్నాయి. పైకెక్కుతున్నప్పుడు శరీరంలోని బలాన్నంతా మోకాళ్లల్లోకి కుదించుకుని కసరత్తు చేయక తప్పదు. క్రిందికి దిగుతున్నప్పుడు పళ్లు కరచుకొని బ్రేకుల్ని బిగపట్టక తీరదు. ఆదమరిస్తే అపాయం! సైకిల్లో నుంచీ ఈ గుల్లరోడ్డు పైన బడితే ముక్కూ మొగమూ చదునుగావన్న నమ్మకం ఏముంది?

మైలురాళ్ళు మూలంగా అప్పటికి తను పది మైళ్లు వచ్చినట్టు, యింకా అంతదూరం వెళ్లవలసి వున్నట్టు తెలుసుకోగలిగాడు సత్యం. ఇంకా పదిమైళ్లు! ఆ ఊహ మనస్సులో మెదలగానే సత్యం గుండె జల్లుమంది. అతడు నడుము పైకెత్తి నిక్కి నిక్కి చూచాడు. కనుచూపు మేరలో శ్రీహరి సైకిలు కనిపించటం లేదు.

ఉన్నట్టుండీ సత్యం ఒక నిర్ణయానికి రాగలిగాడు. ఈసారి బాటలో ఒక చల్లటి ఆశ్రమం ఎక్కడైతే తారసిల్లుతుందో అక్కడతను సైకిలు దిగేయవలసిందే! ఆ పైన తనొక అంగుళమైనా కదల్లేడు. అంత త్వరగా వెళ్లి తనా వూళ్లో వెలిగించబోయే రాచకార్య మేదీ లేదు. ఈ శ్రీహరి సంగతి వేరు! వీడు పోయిన జన్మలో ఏ సహారా ఎడారిలోనో మానవుడై వుంటాడు.

కానీ ఆ చల్లటి ఆశ్రమం కూడా సత్యానికి అంత సమీపంలో ఎక్కడా తారసిల్ల లేదు. ఆ ప్రాంతంలో చింతచెట్లు తప్పిస్తే, మరొక చెట్టు సత్యానికి దృగ్గోచరం కాలేదు.

ఉన్న చింతచెట్లు గూడా చేతులు తెగిన బాణాసురుడికిమల్లే వికృతంగా వున్నాయి. ఆ రోజు ఉదయం నిద్రనుంచి లేవగానే, తనెవరి ముఖాన్ని చూచాడో, వాళ్లని కసితీరా తిట్టు కొంటూ సత్యం మళ్లీ ఒకటి రెండు మైళ్లు అలవాటుపడిపోయాడు.

పన్నెండో మైలురాయి ఇక రెండు ఫర్లాంగులు వుందనగా సైకిలు ఓ చెరువు కట్టపైకెక్కింది. కట్ట కిరువైపులా బారులు తీరివున్న గానుగచెట్ల నీడ అదొక పన్నీటి జల్లులా సత్యానికి ఎదురైంది. ఆ గాలి చందన స్పర్శలా అతని శరీరానికి చల్ల చల్లగా సోకింది. అతడు దిగ్గునకిందికి దిగాడు. సైకిలును బాటపైనే నడిపి, మేను వాల్చడానికి అనువైన చోటుకోసం చుట్టు ప్రక్కల కలయజూచాడు.

అప్పటివరకూ సత్యానికి శ్రీహరిగూడా తనలాగే అక్కడ సైకిలు నిలబెట్టి ఓచెట్టు బోదెకు చేరగిలబడి వున్నాడన్న సంగతి తెలియదు.

"ఏంరా సత్యం! ఎండ నీతో ఏమన్నది?" అన్నాడు శ్రీహరి.

"నీ బోటి మిత్రుల్ని నమ్మగూడదన్నది" అన్నాడు సత్యం.

స్నేహితునికి వళ్లు మండుతోందన్న విషయం గ్రహించుకోగలిగిన శ్రీహరి ఆ తర్వాత మౌనంగా వుండిపోయాడు.

ఐదారు నిముషాలు అలాగ గడిచిపోయాయి. సత్యం కాస్త స్థిమితపడిన తర్వాత పక్కకు ఒత్తిగిల్లుతూ శ్రీహరికేసి చూచి "నీకు ధర్మరాజు స్వర్గానికి వెళ్లిన దారి కథ తెలుసునా? అన్నాడు.

" ఆ కథ కిప్పుడే మొచ్చింది?" అన్నాడు శ్రీహరి.

"బొందితో స్వర్గానికి వెళ్తున్నప్పటికీ, ఆయన తన నొక ప్రాణి వెంబడిస్తున్నదని మరచి పోయాడుగాదు. చెట్టంత మానవుణ్ణి, నే నొకణ్ణి వెనువెంట వస్తున్నానన్న ధ్యాసే నీకు లేకపోయింది. పోనీలే శ్రీహరీ! ఇప్పుడు నాకు దాహంతో నాలుక పిడచగట్టుకు పోతుంది. దగ్గర్లో ఎక్కడైనా మంచినీళ్లు దొరుకుతాయేమో చూడు."

"నేను మాత్రం ఆకలిదప్పులకు అతీతుణ్ణా సత్యం? అప్పుడే నాలుగువైపులా చూచాను. ఊఁహుఁ మన కిక్కడ మంచినీళ్లు దొరికే అవకాశం లేదు. లేదంటే దోసపాదులకోసం చెరువులో అక్కడక్కడా చెలమలుదీసి వున్నారు. ఆ చెలమల్ని గూడా గాలించేశాను. అట్టడుగున బురుదనీళ్లున్నాయి. నువ్వు తాగదలుచుకుంటే నా ఆక్షేపణేమీ లేదు...."

దోసపాదులమాట వినగానే సత్యానికి నోరూరింది. అతడు లేచి కూర్చున్నాడు. నిజానికి దోసపళ్లంటే సత్యానికి చాలా యిష్టం.

"ఒరే శ్రీహరీ! ఎలాగూ మన కిక్కడ మంచినీళ్లు దొరకవు. నువ్వెళ్లి ఓ దోసకాయకోసుకురాకూడదూ?"

"ఆపని నువ్వుకూడా చేయవచ్చునే!" పుల్ల విరిచినట్టు చెప్పేశాడు శ్రీహరి.

"అవుననకో, కానీ ఎవరైనా పోట్లాటకొస్తే?"

"రావచ్చు" అసంభవమేమీ కాదు. రోటిలో తలదూర్చినప్పుడు రోకటి పోటుకు వెరవకూడదు సత్యం!". సత్యం చివాలున పైకి లేచాడు.

"పెడసరంగా మాట్లాడడం తప్పా మరొకటి చేతగాదు. నేను వెళ్లి కోసుకొస్తే అప్పుడు నీవు భాగానికి రాగలవు. అదొకటే నీ చేతనైంది" అంటూ చరచరా కట్ట దిగి దోసపాదుల వైపు నడవసాగాడు.

సత్యానికి తనంత చేయరాని పనేమీ చేయబోవడం లేదనిపించింది. దాహంగా వున్నందువల్ల, దగ్గర్లో మంచినీళ్లు లేనందువల్ల తప్పనిసరిగా ఒక దోసకాయకోసం పాలుమాలవలసి వచ్చింది. ఇది దొంగతనం కింద జమకట్ట వలసిన వ్యవహారంగాదు. తనపైన తానే నేరారోపణ చేసుకుని, అందుకు సంజాయిషీకూడా తానే చెప్పుకుంటూ సత్యం దోసపాదును సమీపించాడు. కంచె తీయడంలో పట్టు విడుపులుగానీ, దాటడంలో మెలకువలుగానీ తెలిసినవాడు కాకపోవడం వల్ల అతని కాళ్లకు, చేతులకు ముళ్లు గ్రుచ్చుకున్నాయి. కానీ, దోసకాయ కోసుకురావడం లాంటి కార్యంలో ఒకటి రెండు ముళ్లు గ్రుచ్చుకోవడం ఒక చెప్పుకోదగ్గ ప్రమాదంగా తోచలేదు సత్యానికి.

అతడు తన తొలిచూపు కాసిన కాయల్లో బాగా మాగి నిగనిగలాడుతున్న కాయను ఏరీ కోరీ కాడతో సహాతుంచేశాడు.... ఇంతపెద్ద దోసకాయను శ్రీహరి తన జీవితంలో చూచి వుండడు. నీకు భాగం లేదు పొమ్మని వాడినొక అరగంటసేపైనా ఉడికించాలి.... ఇలాటి ఊహలతో సత్యం మళ్లీ కంచె దాటబోతున్నాడు- దూరంనుంచి ఓ గొంతుక ఉరిమింది.

"ఏమయ్యోవ్! ఆగాగు! మంచి పెద్దమనిషివేలే! వస్తానుండు"- మాటలెంత పరుషంగా వున్నాయో ఆకారం కూడా అంత మోటుగా వుంది. మిడిగ్రుడ్లు, బొద్దు మీసాలు, పెద్ద తలగుడ్డ, చేత దుడ్డుకర్ర, అంగుళం మందమున్న కిర్రుచెప్పుల తాకిడికి భూమి అదిరిపోతుండగా అతడు సత్యాన్ని సమీపించాడు.

ఇలాంటి ఆపత్సమయాల్లో 'వెరిసారీ! ఎక్స్‌క్యూజ్‌మి' లాంటి పదాలతో క్షమాపణ చెప్పుకోవడం సత్యం అలవాటు. థియేటరులో ముందువైపు కుర్చీలోవున్న మనిషికి కాలు తగిలినప్పుడు రోడ్డులో ఎదురుగా వస్తున్న మనిషికి ఢీకొట్టుకొన్నప్పుడు అలాంటి మాటలే

సత్యాన్ని ఎన్నోసార్లు రక్షించాయి. ఆ పూర్వానుభవాల్ని మనసులో వుంచుకొని సత్యం ఆ మాటల్ని తెలుగులోకి అనువదింప బోయాడు.

"దీన్ని మీరు దొంగతన మనుకుంటున్నందుకు చాలా విచారంగా వుంది. ఒకటంటే ఒక కాయను మాత్రమే! ఐనా చేసిన పనికి మన్నించమని కోరుతున్నాను."

"ఏంటయ్యా నీ నీతకాలు! దోవంటవెళ్లేవాళ్లందరూ యిలా కాయలు కోసుకెళ్తే మా బ్రతుకేం కావాలని?" రెట్టించిన కోపావేశంతో ప్రశ్నించాడు రైతు.

ఇక లాభం లేదనకుని సత్యం "పోనీ, దీని వెల ఎంతో చెప్పండి. చెల్లించుకుంటాను" అన్నాడు.

"వెల చెల్లించుకుంటావూ" అని రాగం తీసి అతడు "ఈ సరసం మరీ బాగుంది..... లేకుంటే గుట్ట చప్పుడుగా కాకుండా పోవడం, ఎవరూలేరని ఎత్తుక ఉంటే వెల చెలిస్తాననడం! ఐతే యిచ్చుకో మరి! నా కాయవెల ఎనిమిది అణాలు అన్నాడు.

"ఎనిమిదణాలే! ఒక్క దోసపండు!" విస్తుపోయాడు సత్యం.

కొంచెం బెట్టుసరి చేస్తే ఎదుటివాడు ఈ వెల యిచ్చుకోక తప్పదనుకున్నాడేమో" "గిట్టుబాటు కాకపోతే కాయనక్కడ వుంచేసి వెళ్లిపోవచ్చు" అన్నాడు రైతు.

కోపంతో సత్యం ఆకాయను అతడి ముందుకు గిరవాటు వేసి రిక్త హస్తాలతో చెరువుకట్టవైపు దారి తీశాడు.

"నువ్వున్నూ, నీ ఏడుపుముఖమున్నూ! ఏం జరిగిందిరా సత్యం" అన్నాడు శ్రీహరి.

"అంతా నువ్వనుకున్నట్టే జరిగింది" అన్నాడు సత్యం.

"ఇంత నోరులేని వాడివి, నువ్వీ లోకంలో ఏం బ్రతకగలవురా బాబూ" - శ్రీహరి జాలి పడ్డాడు.

"అప్పటికి నువ్వు మహా బ్రతికి ఏడవగలిగినట్టు!"

"ఐతే చూస్తావా మరి!" సవాలు విసిరాడు శ్రీహరి.

"ఏదీ కానియ్! చూద్దాం" - ఈ దెబ్బతో మిత్రుని ప్రయోజకత్వం తేలిపోతుం దనుకున్నాడు సత్యం.

శ్రీహరి గబాలున పైకిలేచి, చరచరా కట్టచివరదాకా వెళ్లి యింకా దోసపాదుల దగ్గరే నిలబడివున్న రైతు నుద్దేశించి "ఇదుగో! ఏమిటోయ్, నిన్నే! వినిపించడం లేదూ?" అని కేకలు పెట్టాడు.

సాధికారంగా వెలువడిన ఆ పిలుపు చెవిని బడగా రైతు బిరబిరా కట్టదగ్గరకు వచ్చాడు.

"నీ పేరేమిటి?" కర్కశంగా ప్రశ్నించాడు శ్రీహరి.

"నా పేరా! ఎందుకు బాబూ?"

"నీతో తీరిగ్గా మాట్లాడడానికి నాకు ఓపికలేదు. చెప్పుమరి. నీ పేరేమిటి?" ఈ సారి జేబులోనుంచి డైరీని, పెన్సిలును పైకితీశాడు శ్రీహరి.

"ఎందుకో చెప్పగూడదా బాబు!" రైతు వేళ్లు నలుపుకుంటూ ప్రాథేయపడ్డాడు.

"ఎందుకేమిటి? ఇది నీ పేరు పట్టావున్న పొలం కాదు. చెరువు నేలలో నిన్నెవరు దోసపాదులు పైరుచేయమన్నారు?"

"ఈ ఆనవానాయితీ మొదటినుంచీ వున్నదేకదండీ. చెరువులో నీళ్లెండి పోయినప్పుడల్లా, యిలాగే..."

"ఇంతకు మునుపిలా జరిగిందని, యికపైన గూడా అలాగే జరగాలని ఎక్కడా వ్రాసిపెట్టలేదు. అదేం సాగదు. చెప్పు నీ పేరేమిటో?"

రైతు బాగా మెత్తబడి పోయాడు.

"బాబ్బాబూ! బీదోణ్ణి, కనికరించండి. ఇంతకు మునుపొచ్చి కాయ కోసుకున్నాయన మీ తాలూకు మనిషనుకోలేదు. తెలిసుంటే అలా మాటాడేవాణ్ణి గాను.

"నువ్వు మాట్లాడినందువల్ల నా కొచ్చిన నష్టమేమీ లేదు" అన్నాడు శ్రీహరి.

నచ్చచెప్పుకోవలసింది యిలా కాదనిపించేదేమో ఆ రైతు ఒక్క పరుగుతో వెళ్లి దోసపాదుల్లో పడ్డాడు. తీగల్లోంచి నాలుగైదు పళ్లను త్రుంచాడు. పై గుడ్డలో మూటగట్టి మోసుకొచ్చి శ్రీహరి పాదాలముందర క్రుమ్మరించాడు.

అతడు చేసిన నేరం ఎదుట, ఆ కానుక కెంత మాత్రం నిలువలేనట్టు శ్రీహరి పెదముఖం పెట్టి "ఈసారికి పోనీ అని వదిలి పెట్టేస్తున్నాను" అన్నాడు.

"అదిగదే! బాబుగారిది బహు దొడ్డమనసు" కృతజ్ఞతను వెలిబుచ్చాడు రైతు.

"మంచికి కాలం లేదు. నోరు కలిగినవాళ్లదే రాజ్యం" అనుకున్నాడు సత్యం.

(...ఆంధ్ర సచిత్రవారపత్రిక)

❀ ❀ ❀